ఈ వారం తెలుగు పుస్తకం

# సరస సల్లాపోక్తులు, చురుకు భాషణలు

# మల్లాదివారి కథన కుతూహలం

నిడదవోలు మాలతి




**Author:** Ramakrishna Sastry
**Subject:** SHORT STORIES
**Year of Publication:** 2005
**Price:** USD $ 4.05

చలం చిత్రించిన విశృంఖలతకీ కొడవటిగంటి కథల్లోని ఆర్థిక, సామాజికావగాహనకీ నడుమ మెరుపులా నిల్చి, కథలని కవితలలా మలిచిన రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి గారు.

స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ ప్రకృతి సిద్ధం. అయితే ప్రతి జీవికీ సహజమయిన ఈ ఆకర్షణ మూలాన లేదా దాని పేరు మీద ఎన్ని అత్యాచారాలు జరుగుతున్నాయో చలం, కొడవటిగంటి ఎత్తి చూపితే, రామకృష్ణ శాస్త్రి గతానుగతికంగా వస్తున్న మరొక కోణాన్ని మరొకసారి ఆవిష్కరించారు.

రామకృష్ణశాస్త్రి గారి కథల్లో ప్రధానంగా చెప్పుకోవలసింది కథకుడు. అందులో మొదటిది-పాఠకుడిని మధ్యమ పురుషలో సంబోధిస్తూ కథ చెప్పడం. రెండోది ఆ కథకుడిలో రెండు రకాల వ్యక్తిత్వాలు. ఒక కథకుడు పురాణాలూ, ఇతిహాసాలూ ఆకళించుకున్న పండితుడు. రెండోవారు సమకాలీన సమాజాన్ని నిశిత దృష్టితో పరిశీలించి వ్యాఖ్యానిస్తున్న నిత్యయౌవనుడు.

కొన్ని కథలు చదువుతుంటే, షడ్రసోపేతాన్నాలు ఆరగించి, తాంబూలం సేవిస్తూ కథనం సాగించే పౌరాణికుడు స్ఫురిస్తాడు పాఠకుడికి. అటువంటి యితివృత్తాలు గల కథలు చెప్పేటప్పుడు ఆ కథల్లో తదనుగుణంగానే కొట్టొచ్చినట్టు కనిపించేవి - సరసభాషణలూ, కులకాంతలకి దీటురాగల వారకాంతలూ, వారిచుట్టూ భ్రమరముల వలె సంచరించే ఆబాలగోపాలం! (*వనమాల, స్వరమేళ, రంగవల్లి, డు-ము-వు-లు*). రెండోరకం కథల్లో ఈనాటి సాధారణ దుస్తులలో ఏ స్టేషనులోనో లేక రోడ్డుమీదో నిలబడో, కూర్చునో, 'ఉండుచెప్తా, నీకు అర్థం కాదేమోనని...' అంటూ ఆత్మీయునివలే అనునయవాక్యాలతో ప్రత్యక్షమయే ఇరవయ్యో శతాబ్దపు యువకుడు కనిపిస్తాడు. (*పీఠిక, జోను టికెట్టు*).

కథకి సాంఘికప్రయోజనం వుండాలనీ, అంటే సంఘంలో వున్న కుళ్ళును ఎత్తి చూపి, ప్రక్షాళన చేయగల కథలే మంచి కథలనీ, అలాటి కథలు రాసినవారే కథకులనీ అర్థవుతుంది ఈనాడు వస్తున్న సమీక్షలూ, విమర్శలూ చూస్తే. అంచేత మాల్లాది వారి కథలని ఆ దృష్టితో కూడా పరిశీలించాల్సిన అవసరం వుంది, శాస్త్రిగారికి కథావస్తువు చాలా మటుకు స్త్రీ పురుషసంబంధాలే. స్త్రీ పురుషులు ఒకరికొకరు ఆలంబన. ఎవరికి ఎవరు ఆలంబన, ఎవరు ఎవరిని ఆకట్టుకుని ఆడిస్తున్నారు అన్నది ఒక చిక్కు సమస్య. వారి కథల్లో ఈ సమస్య

అనేకకోణాల్లో ఆవిష్కరింపబడింది. మగవారిలో స్త్రీల చుట్టూ భ్రమరములవలె తిరిగేవారున్నారు. ఆ ప్రవృత్తిని ఆమోదించిన ఆడవారున్నారు. బోగంపడచులకు కన్నెరికం పెట్టడం తమకొక గౌరవంగా భావించే ప్రభువులున్నారు. వారికి నివాళులు పట్టే అర్ధాంగులున్నారు. "ఎవరూ పలకరించకుండా వుంటే సానిపిల్లలు ఏమయిపోవాలి చెప్పూ" అని నిగ్గదీసి అడిగే మహానుభావులున్నారు (*గురుప్రసాదం*). అటువంటి మగధీరులని నిలవేసి, " "నేను మీతో ఎందుకు లేచిపోవాలి? కావలిస్తే మీరే రండి నా దగ్గరికి" అంటూ సవాల్ చేసిన వీర వనితలున్నారు (*కనక జానకి*). మగవారిని తమకొంగున కట్టుకుని, ఆడించి, లాలించి, బెల్లించి, జాలిపడి కనికరించిన జాణలున్నారు. అదే నీతి అని సాటి ఆడవారికి బోధ చేసిన ముద్దరాళ్ళున్నారు.

కొన్ని కథల్లో స్త్రీ భోగవస్తువుగా చిత్రింపబడితే, మరికొన్ని కథల్లో విశిష్టమైన, విలక్షణమైన స్త్రీ పాత్రలు దృగ్గోచరమవుతాయి పాఠకుడికి. సాధారణంగా ఒక సిద్ధాంతానికో వాదానికో కట్టుబడి రచనలు చేసినప్పుడు, ఆ రచయిత రచనావ్యాసంగం ఏకోన్ముఖంగా సాగే ప్రమాదం వుంది. తద్భిన్నంగా రామకృష్ణశాస్త్రిగారి కథల్లో అసామాన్యమయిన వైవిధ్యం చోటు చేసుకుని సమ్యక్ దృష్టిని సాధించింది. అందుకే కొన్ని కథల్లో వారకాంతల గురించిన వాక్యాలు కొంత కలవర పరచినా, ఒక చారిత్రక సత్యాన్ని కూడా ప్రస్ఫుటం చేస్తాయి. వారకాంతలనీ, వారి వ్యాపకాలనీ చిత్రించినపుడు కూడా శృంగార కథనాలలో సర్వసాధారణమయిన అంగాంగవర్ణనలు కనిపించకపోవడం (కావ్యాలనుంచో ప్రబంధాలనుంచో ఉదాహరణలు ఎత్తిచూపినప్పుడు తప్ప) కథకుడి సంయమానికి చిహ్నంగా కనిపిస్తుంది.

*మధ్యాక్కర, ఆతిథ్యం* కథలు పక్కపక్కన పెట్టిన చదివితే, రెండు తరాల మానసిక ప్రవృత్తులలో అంతరం,ఆంతర్యం స్పష్టం అవుతుంది. మధ్యాక్కరలో తాతగారు అమ్మమ్మకీ మనవడికి కూడా సాని పాపలయందు తమకున్న ఆదరాభిమానాలు విశదం చేస్తారు. కథాంతంలో బీబీ నాంచారమ్మని స్మరించు కోవడం గతంలో రసహృదయులు సర్వసాధారణంగా వుదహరిస్తూ వచ్చిన ధర్మసూక్ష్మం. *ఆతిథ్యం* కథలో మనవడిని కూడా అదే దోవన అనపడానికి ప్రయత్నిస్తారు తాతగారు. భరతుడినుండి బిల్వమంగళుడివరకూ గ్రంథప్రామాణ్యాలు పునరుద్ఘాటించి, అతిథిసేవలో 'అది' విధిగా అమర్చాలనీ, టీ, సిగరెట్లలాగ స్త్రీలు సర్వసాధారణం అనీ ప్రవచించి, అత్తరు పూతలతో , కొత్త పెళ్ళికూతురిని శోభనంగదిలోకి తోలినట్టు సానివాడకి తోలితే, ఆ యువకుడు చేసిన ఘనకార్యం ఈనాడు మనకి న్యాయమే కాని తాతగారికీ, వారిలాటి సనాతనులకీ అవహేళన! ఆ సంగతి ఆ యువకుడికీ తెలుసు. తాను తిరిగి ఇంటికి వచ్చేలోపున ఆయన ఎన్ని సార్లు నవ్వు కున్నారో అంటాడు కథకుడు. ఇది కూడా మల్లాదివారి కథల్లో ప్రత్యేకతే. ఏ సందర్భంలోనూ ఏ పాత్రకీ కోపం రాదు. వచ్చినా నా హద్దు మీరి ఆగడానికి దిగదు. మల్లాదివారి కథల్లో అందరూ మంచివాళ్ళే. కట్టు కథలు చెప్పి తన దగ్గర డబ్బులు వడికిన వ్యక్తి కూడా అప్పుడే, కంగు తిన్నవాడు సుప్రసన్నుడే (మీమాంస).

ముందు తరాల మగవారి దృష్టిలో కళావంతులు సంఘంలో ఆదరించదగ్గ భాగం అయితే, తరవాతితరం యువకుల దృష్టిలో వారు సంఘదూరులు. ముందుతరాల వారు స్త్రీలని భోగవస్తువుగా పరిగణిస్తే ఆ తరవాతివారు, అంటే చారిత్రకంగా ఇరవయ్యో శతాబ్దం తొలిదశ నాటికి, అది తప్పగా భావించడం ప్రారంభించారు. కాలానుగతంగా వచ్చిన ఈ మార్పు శాస్త్రిగారి కథల్లో ప్రస్ఫుటమవుతుంది. *ద్రౌపదీ వస్త్రాపహరణం, ఆతిథ్యం* లాంటి కథల్లో అమ్మాయిలలో తిరుగుబాటుతనం, అబ్బాయిల్లో ఒక రకమయిన

అయోమయం చోటు చేసుకున్నట్టు కనిపిస్తాయి. అబ్బాయిలు తెగించి బోగంయిళ్ళకి వెళ్ళలేరు, వారిని సాటి మనిషిగా గౌరవించనూ లేరు. ద్రౌపదీవస్త్రాపహరణంలో చంద్రం తల్లికి లోకం తమకి వారకాంతలు, దేవదాసీలు అంటూ ఏ పేరెట్టినా, తాము బోగం వాళ్ళు అన్నది సువిదితం. అందుకే ఆవిడ తనని తానే వెలివేసుకుంది. ఇందులో సంఘంలో గూడు కట్టుకున్న కుహనా విలువల గురించిన ఎత్తిపొడుపు వుంది. నోటితో మాటాడుతూ నొసల్తో వెక్కిరించడం లాటిదే ఈ పేర్లు పెట్టడం. ఆత్మగౌరవం వున్న ఏ వ్యక్తికీ సాంత్వన కలిగించదీ ప్రవృత్తి.

కాలేజీలో మగవిద్యార్థులు మహోత్సాహంతో ద్రౌపదీవస్త్రాపహరణం నాటకం వేద్దాం అనుకున్న తరవాత పిల్లి మెళ్ళో గంట కట్టేవాళ్ళెవరు? ప్రిన్సిపాల్ చేత చంద్రాన్ని ద్రౌపదిగా వేయమని అడిగించడంలో కనిపిస్తాయి ఆ కుర్రాళ్ళ ఓటుగండెలు. వారి ఆంతర్యాన్ని గ్రహించి, వారికి బుద్ధి చెప్పాలని చంద్రం నిర్ణయించుకున్నప్పుడు పాఠకుడికి కలిగిన సంతృప్తి ఆ తరువాత అట్టే సేపు నిలవదు. తనని సాటి విద్యార్థులు బోగందానిగానే చూశారు, తను వారి చెల్లెలితో ఏనాటికీ సమం కాదు అని ఆమె గ్రహించింది కాని ఒక స్త్రీ తన పరువు నిలుపుకోడానికి మార్గం మరొక స్త్రీ పరువు ఎరవేయడమా అన్న ప్రశ్న ఉదయించక తప్పదు పాఠకుడిలో ఈ ముగింపుతో! బహుశా, ఇది కేవలం కుర్రకారు ఆకతాయితనం అనుకుని సరిపెట్టుకోవాలేమో.

మంత్రపుష్పం కథలో "సీతాయ్, అదో పెద్దబాలశిక్ష" అంటాడు కథకుడు. "కడుపెరిగి ఉంగట్టకపోతే జాతి జాతంతా ఆకటితో అలమటించిపోతుంది" అంటుంది సీతాయ్. ఆమె యుద్ధశిబిరానికి తనకు తానుగా వెళ్ళి, సైనికులని సుఖపెట్టి జాతిని ఉద్ధరించిన పుణ్యాత్మురాలు. సీతాయ్ (చిట్టి) లాగే విలక్షణమైన స్త్రీపాత్ర చైత్రరథంలో నాగరత్నం.

చైత్రరథంలో ప్రధాన పాత్ర నాగరత్నమే అయినా, ప్రధానాంశం ఆనాటి రాజకీయాలు, రాజకీయనాయకుల నీచప్రవృత్తులు. చిత్తశుద్ధితో అయినవారినందరినీ కాదని తనని తానే దేశసేవకి అంకితం చేసుకున్న వేశ్య నాగరత్నం చివరికి వేసారి "ఎందుకిలా ముత్యాలు వెదజల్లడం" అనుకుని వెనకటి వైభవంలోనికి ఒత్తిగిలింది. కథంతా వ్యంగ్యాత్మకంగా నడుస్తుంది. శాస్త్రిగారు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో (నేనూ నా కతలు) మీ కథలో నీతి ఏమిటి అంటే దానికున్నది జాతి అన్నారు. పై కథల్లో జాతిపై పదునైన విసుర్లు కనిపిస్తాయి.

సినీవాలీలో మంజరి, సర్వమంగళలో అక్క తమకి తాము పెద్దలయి కథకి సారథ్యం వహిస్తారు. ఈ రెండు కథల్లోనూ సందేశం ఒకటే. ఆడవారు కావలసినప్పుడు కళ్ళేలు తమ చేతుల్లోకి తీసుకు సారథ్యం వహించగలరనే. అయితే, సినీవాలీలో మంజరికున్న ఆత్మ స్థైర్యం సర్వమంగళలో అక్కకి లేదు. తనకు తానుగా తనని బలిచ్చుకున్నాననడంలో తనని తాను కించపరచుకోడమే కనిపిస్తుంది. సినీవాలీలో తుదివిజయం మంజరిదే. సర్వమంగళలో అక్క చేసిన త్యాగం అర్థరహితం, ఆవిడ బతుకు గంగపాలు. ఈ కథమీద రచయిత వ్యాఖ్యానం ముందుమాటలో చదివినతరవాత కూడా సర్వమంగళ అన్న శీర్షికలో ఔచిత్యం నాకు బోధపడలేదు. ఇంటింటా వుండే భాగోతమే కాని శాస్త్రిగారి కథల్లో **heavy duty** సంఘర్షణలు చూడం అనడానికి గృహిణీపదం ఒక మచ్చుతునక. హాస్యం, వ్యంగ్యంతో కూడిన సంభాషణలు, ఎత్తిపొడుపులతో సరదాగా సాగిపోయే కథ."మానుషమున్న ఏ ఆడది.. మొగవాణ్ణి పెళ్ళి చేసుకోవడానికి వప్పుకుంటుంది." ఆమె వాదన. "నిజమే... నేనూ మా మేనత్తకొడుకును చేసుకున్నట్లయితే బాగుండేది" అని అతని జవాబు. గీతగోవిందం పెండ్లాం వ్రాసిన కావ్యాన్ని తగుదునమ్మా అంటూ తన పేర పెట్టించుకున్నాడు జయదేవుడు అంటుంది ఆమె. అతను నవ్వుతాడు.

పరిశీలించి చూస్తే పాత్రచిత్రణలో వైవిధ్యం కనిపిస్తుంది. ఒకవిధంగా చెప్పాలంటే ఈ పాత్రలనన్నిటినీ ఒకచోట చేర్చి చూస్తే, మన సాంఘికపరిణామం ఛాయామాత్రంగా చూడగలుగుతాం. స్త్రీ పురుషసంబంధాల గురించి స్త్రీలలో పురుషులలో వెనకటి తరంవారికీ తరవాతి తరాలవారికీ వున్న అభిప్రాయాలలో భేదాలకి అద్దం పడుతుంది ఈ సంకలనం స్థూలంగా.

డు-ము-వు-లు కథలో ఇతివృత్తం ఐతిహాసికమే అయినా సందేశం ఆధునికంగా తోస్తుంది. పెద్దలు తమ మూర్ఖపు పట్టుదలతో భార్యాభర్తలని ఓకాడికి చేర్చ నిచ్చగించకపోతే, ఆ చిన్నవాడికి, లోకజ్ఞుడయిన ఓ తాతగారి సలహా పెద్దలని ధిక్కరించమనే.

"తండ్రిని తిరస్కరించిన కుమారుడికి ఉత్తమగతులుండవని శాస్త్రాలు ఘోషిస్తున్నాయట గదా" అంటే, తప్పుదారి పట్టిన తండ్రికి విధేయుడై, ఆలిని ఉసురు పెట్టేవాడి గతీ అంతేనంటున్నాయి నాయనా" అని సమాధానం. అలాగే ఏష ధర్మ సనాతనః లో కూడా దుర్మార్గుడయిన తండ్రిని కంటగించుకుని, తల్లి పతివ్రత కాకపోతేనూ, తాను ఆ తండ్రికి పుట్టివుండకపోతేనూ తనకి హర్షదాయకమేనంటూ కొడుకు తండ్రిని ఎద్దేవా చేయడమే ఇతివృత్తం. కారణం ఆ తండ్రిని హింస పెట్టడం, దానికి తల్లి తల ఒగ్గడం. ఉత్తమ పురుషలో సాగిన ఈ కథ కేవలం ఒక చిన్న స్వగతంలా సాగుతుందే తప్ప తుదీ మొదలూ కనిపించవు. కథకుడికి కావలసిందల్లా తన తండ్రి "శుద్ధ వెధవ" అని శ్రోతని (పాఠకుడిని) నమ్మించడమే. ఈ రెండు కథల్లోనూ కథకుడు స్త్రీల పట్ల పురుషుల అమానుషచర్యలని గర్హించడం గమనిస్తాం. రెండు కథలకి కథాకాలం ఒకటే కాకపోవడంతో ఒక చారిత్ర్యాక సత్యాన్ని ఎత్తిచూపుతున్నట్టు తోస్తుంది. స్త్రీలని హింసించే మూర్ఖులు ఏకాలంలోనూ వుంటూనే వున్నారు! మొదటి కథలో ఈ హింస ప్రధానాంశమైతే, రెండో కథలో కేవలం సందర్భానుసారం చేసిన వ్యాఖ్యానం గా కథలో చోటు చేసుకుంది.

పాత్రలనన్నిటినీ - పై తరగతి, కింది తరగతి కూడా - పరిశీలించినప్పుడు మనిషికి తనలో తనకి ఉన్న నమ్మకం, ఆభిజాత్యం, ప్రధానాంశంగా కనిపిస్తాయి వీరి కథల్లో. కళావంతులు, దేవదాసీలు- సంఘం సంభావించిన నామధేయాలన్నిటినీ తృణీకరించి, చంద్రం తల్లి తనకు తానే వెలి వేసుకుంది. ఆవిడ పెంచుకున్న బిడ్డ చంద్రానికి కూడా ఆవిడ పెంపకంలో ఆ తత్త్వమే అలవడింది. ధర్మపన్నం, ఆతిథ్యం కథల్లో గృహస్థు భార్యని అతిథుల సేవలో నియమించడం న్యాయం అంటూ తాతగారిచేత చెప్పించడం, స్త్రీలు ఆ ధర్మాన్ని ప్రశ్నించకపోవడం ఈనాటి విలువలదృష్ట్యా హేయంగా కనిపిస్తుంది, ఆ విషయాన్ని మరొకసారి ఎత్తి చూపడమే రచయిత ఆశయమా? ఈనాడు నవనాగరికత పేరున, స్వేచ్ఛ పేరున ఇదే జరుగుతూండడం ( **Swinging or Wife-swapping** ఒక ఉదాహరణ) తలుచుకుంటే, ఈ కథ వక్రోక్తి అనొచ్చు. అన్యపదేశంగా వర్తమానంలో కూడా ఈ ఆచారం సాగుతూనే వుందన్న హెచ్చరిక. వర్తమానాన్ని తీర్చి దిద్దుకోవడానికి గతాన్ని గురించిన అవగాహన అవసరం. అదే రచయిత ఆశయం కావచ్చు.

ధర్మం పేరుతో బిచ్చగాళ్ళ విషయంలోనూ, సాంఘికన్యాయం పేరుతో బోగంవాళ్ళ విషయంలోనూ పై తరగతివాళ్ళు చేస్తున్న ఆర్భాటాలకీ, ఆ ఆర్భాటాలలో కృత్రిమతకీ రూపకల్పన ద్రౌపదీ వస్త్రాపహరణం, పల్లవిలాటి కథలు. " కడుపు మాడ్చడంకన్నా నింపడం మహాపాతకం" అంటాడు పల్లవిలో బిచ్చగాడు. ఇంతమంది ఇంత చేస్తుంటే, మరి బిచ్చగాళ్ళ సంఖ్య తరగలేదేం అంటే సమాధానం ఏమిటి?

ఇది మదరాసు కథలో కాలానికి కొలమానంగా సృష్టింపబడిన జీవంలేని గడియారం వద్ద మీకు టైం చెప్పడమే మా పనా అని ఎద్దేవా చేస్తే నవ్వు రాకమానదనదు చదువరికి. అయితే కథ కొసకంటా చదివినప్పుడు కథకుడి ఆంతర్యం బోధపడుతుంది. టైము లేదు, టైము లేదంటూ కిరకిరలాడేవాళ్ళందరూ గమనంలో ఉంచుకోవలసింది ఈ కొలమానాలనీ, అనేకానేక పరిధులనీ సృష్టించుకున్నది మానవులేనని. గడియారానికేముంది, 'కీ' ఇచ్చి ముళ్ళని ఎక్కడ అమరిస్తే అక్కడినుంచే తిరుగుతూ పోతుంది. మనుషులే నిర్ణయించుకోవాలి తమ జీవన సరళి.

ఈ కథలన్నీ ఇక ఎత్తయితే, ప్రాచీన గాథలలోని పాత్రలతో తనదైన శైలిలో కథని మలచడం మరొక ఎత్తు, *వనమాలి, రంగవల్లి, రవిచంద్రిక* ఈ కోవలోనివి. ఈ కథల్లో విశేషం శాస్త్రిగారి కథనం, శైలి. ఈ కథలో నిజం ఎంత, కల్పన ఎంత, సందేశం ఏమిటి వంటి చర్చలకి ఆస్కారం లేదు. ఒక సుందర సురుచిర కావ్యం చదివిన తృప్తి కలగాలంతే ఇవి చదివినప్పుడు.

మల్లాదివారి కథల్లో కొట్టొచ్చినట్టు కనిపించేది భాష. ఇప్పుడు తెలుగులో ఇంగ్లీషు ఎంతుందో ఆ రోజుల్లో సంస్కృతం అంతుండేది. మల్లాది కథల్లో జానుతెనుగూ, సంస్కృత సమాసాలూ కూడా కలగాపులగంగా కనిపిస్తాయి. విశేషం ఏమిటంటే ఈ రెండు పాయల్నీ ఒక గాటకట్టి కథని నడిపించిన ఆయన రచనాకౌశలం.

సిసలైన తెలుగు నుడికారం, "మంచిమాట చేసుకు రానా" (భోజనానికి ఏర్పాటు చేయనా అన్న అర్థంలో ), "పిల్లది లోజెడ్డది" (జ్వరం వచ్చింది) వంటి వాక్య నిర్మాణం తెలుగుభాష మీద మమకారం వున్న వారిని పట్టి అలరిస్తాయి. " కాకినాడ పరగణా వాళ్ళు తిడుతూన్నప్పుడు వాళ్ళ నోటివెంట యెంత చక్కని జాను తెనుగు రేగుతుందనీ.." అంటారు శాస్త్రిగారు పల్లవి కథలో. అలాటి జాను తెనుగు బహుశా అలా వినే కాబోలు హక్కు భుక్తం చేసుకుని సద్వినియోగం చేసుకున్నారాయన తమ కథల్లో.

కడుపు మండినప్పుడు నోట వచ్చేది అచ్చ తెలుగేననడానికి మరొక ఉదాహరణ *ఖామోష్, సర్వమంగళ*లాటి కథల్లోని భాష. *ఖామోష్*లో ప్రధాన పాత్ర ద్వారా చక్కని మాండలీకంలో వింటాం కథంతా. తల్లి తనని తలకు మాసిన తమ్ముడుకి అంటగట్టబోతే కాదని, తండ్రిచేత తన్నులు తిని , ఆదరించిన మారాజు మట్టి అయిపోగా, తెలుసుకున్న జీవితసత్యం -"ఆడకూతురికి ఓ కంట యెన్నెలుండాలి, ఓ కంట కత్తులుండాలి - గొంతులో కోయిలుండాలి - కొరడా వుండాలి, ... గుబుల్ దప్పితే నరమానవుడు- మనకు గులమే; మాలిక్ కాదే - ఫికర్ నయ్ - ఇది యాదుంచుకు బతుకు" అంటుంది కథానాయిక.

సాధారణంగా మంచికథకి ముఖ్య లక్షణం పాఠకుడిలో ఉత్సుకత నిలపగలగడం. శాస్త్రిగారి కథల్లో ఉత్సుకత తో పాటు వాక్చాతుర్యం కూడా సరిసామానంగా తులతూగుతూ పాఠకుడిని వుల్లాసపరుస్తుంది. అంచేత, పాఠకుడి దృష్టి ఒక్క కథ - ముందేం జరుగుతుందన్న కౌతుకం మీద నిలవడమే కాక మనసు ఆ పద రమ్యతకి పరవశిస్తుంది కూడా.

సాహిత్యం ప్రతీకాత్మకం. ధ్వని ఒక ముఖ్యమైన అంశం కథనంలో. వాచ్యం చేయడానికి మనసొప్పని వాక్యాలకీ, పాఠకుల మేధని సాన పెట్టడానికీ కూడా పనికొచ్చే సాధనం ధ్వని. రామకృష్ణశాస్త్రి గారి కథల్లో ఈ ధ్వని అపారం. కదాచితుగా పాఠకుడిని తికమక పెడుతుంది కూడా. ఒక సన్నివేశం కానీ, సంఘటన కానీ, ఏం జరిగింది అన్న వివరాలకంటే అనుభూతికి - పాత్రలు ఆయా సందర్భాలలో ఎలా స్పందించాయి అన్న దానికి

ప్రాధాన్యత అధికం. కాని ఒకొక్కప్పుడు ఏ వాక్యాలు ఎవరు అంటున్నారో అర్థం కాక పాఠకుడిని కంగారు పెడతాయి. కారణం మనకి అనూచానంగా వస్తున్న జానపదకథనరీతుల ఛాయలు కావచ్చు. కొన్ని కథల్లో కొటేషన్ మార్కులు అసందర్భంగా వుండి గందరగోళం చేస్తాయి కథని. వెనకటి రోజుల్లో ఈ విషయం పాఠకులని అంతగా బాధించలేదేమో కాని ప్రస్తుతకాలంలో మాత్రం , ఈనాటి చదువరుల దృష్ట్యా, పునర్ముద్రణలో ఇవి సవరించి వుంటే బాగుండేది (ఉదా.గృహిణీపదమ్).

భాష విషయంలో చివరిమాటగా, భాషాభిమానులకీ పరమానందం కలిగించే ఈ కథల్లో నా బోటి సామాన్యులకి అర్థం కాని మాటలు కూడా కనిపిస్తాయి అక్కడక్కడ. కొన్ని సందర్భాన్ని బట్టి గ్రహించుకున్నా ఒకొక్కప్పుడు ఏమిటంటున్నారు చెప్మా అనిపించక మాదనదు. 'అధికచక్కంది', రాళ్ళు చేస్తూ' వంటి పదబంధాలు తమాషాగా తోస్తాయి. కొన్ని పదాలు అచ్చు తప్పులేమోనని అనిపించిన సందర్భాలు కూడా వున్నాయి. నిజానికి, ఈనాటి చదువరులలో చాలామంది తెలుగు మర్చిపోయారు. ఆ దృష్టితో చూస్తే, 20 వ శతాబ్దపు తెలుగు కథల్లో మాటలకి ఒక నిఘంటువు వేరే సమకూర్చవలసిన అవుసరం కనిపిస్తోంది. ఇది కేవలం మల్లాది వారి కథలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని అంటున్న మాట కాదు.

శిల్పం విషయంలో, కథకి తలా, తోకా అవుసరమా అంటే, అది పాత్రల యిష్టం అంటారు మల్లాది వారు. కథని మొదలెట్టడం వరకే రచయిత బాధ్యత. ఆ పైన పాత్రలే కథని నడిపిస్తాయి అన్నది వారి అభిప్రాయం (నేనూ-నా కతలు).

కథాసాహిత్యం జాతి చరిత్ర చెబుతుంది. మల్లాదివారి కథలు అందులో హృద్యంగమమైన భాగమని అంగీకరించక తప్పదు.

back to book of the week home page